

సకినాలు కాలుస్తున్న లక్ష్మీ



సంక్రాంతికి ఆర్డర్లు ఫుల్

సంక్రాంతి వచ్చిందంటే మాకు చేతినిండా పని ఉంటుంది. ఖాళీగా ఉండకుండా ఇంటిపట్టున ఉంటూ ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు ఆర్డర్ మీద అప్పాలు చేయాలన్న ఆలోచన వచ్చింది. ప్రత్యేకంగా బ్రాండ్ లేకుండానే తెలిసిన వారి నుంచి ఆర్డర్లు తీసుకుని క్వాలిటీతో సమయానికి ఇవ్వడంతో రోజురోజుకూ గిరాకీ పెరిగింది. అప్పాలు చేయడంతో వచ్చిన పైసలతోనే మా ఇద్దరు అమ్మాయిలను అమెరికా పంపించా.

– తానిపత్తి లక్ష్మి, గ్రూప్ లీడర్, సుల్తానాపూర్

- పండుగకు పిండివంటలతో ఉపాధి
- హోంఫుడ్స్‌కు ఖండాంతరాల్లో డిమాండ్
- చిన్నాపెద్ద కార్యక్రమాలకు భారీగా ఆర్డర్లు
- ఇండ్లలో సహజసిద్ధంగా పిండివంటల తయారీ
- ఉమ్మడి జిల్లాలోని మహిళల స్వయంకృషి

సంక్రాంతి స్పెషల్

విలేజ్ నుంచి విదేశాలకు..

నోరూరిస్తున్న సంక్రాంతి ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే పిండి వంటలు. వారం రోజుల ముందు నుంచే ఇళ్లంతా ఘుమఘుమలు. సకినాలు, గారెలు, అరిసెలు, లడ్డూలు ఇలా తీరొక్క రకాలు నోరూరిస్తుంటాయి. చుట్టుపక్కల వారంతా కలిసి ఆడుతూ.. పాడుతూ ఒకరికొకరు సాయంగా ఉంటూ గతంలో పిండి వంటలు చేసుకునేవారు. ఎక్కడో దూరంగా ఉంటున్న ఆత్మీయులకు పంపించేవారు. ఉరుకులు, పరుగుల జీవితంలో పెద్దమొత్తంలో పిండివంటలు ఇప్పుడు సాధ్యం కావడం లేదు. దీంతో చాలా మంది హోంఫుడ్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన ఇంటివంటలు గ్రామాల్లోనూ విశేష ఆదరణ పొందుతున్నాయి. క్వాంటిటీ, క్వాలిటీయే లక్ష్యంగా తయారు చేసిన వంటకాలను దేశవిదేశాల్లోని మన తెలంగాణవాసులు ఎంతో ఇష్టంగా ఆరగిస్తున్నారు. పండుగ సమయంలోనే కాదు.. ఏడాది మొత్తం గిరాకీ ఉంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని పలు హోంఫుడ్స్, మహిళలకు లభిస్తున్న ఉపాధిపై సంక్రాంతి సందర్భంగా కథనం..

ఆర్డర్లపై తయారీ..

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలోని గణేశ్‌నగర్‌కాలనీకి చెందిన తాడిశెట్టి పద్మ సర్వపిండి సెంటర్ నిర్వహిస్తోంది. పండుగలు, శుభకార్యాలకు ఆర్డర్లపై సకినాలు, మడుగులు, ఖార్జా, బాదుషా తదితర పిండి వంటకాలు చేసి అందిస్తోంది. 10 సంవత్సరాలుగా పిండి వంటలు చేస్తూ మరో ఇద్దరికి పని కల్పిస్తోంది. పండుగ వేళల్లో ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉద్యోగంలో ఉన్నవారికి పంపిస్తున్నారు. స్వీట్లు కేజీ రూ.300, పిండి వంటలు కేజీ రూ.250 చొప్పున అందిస్తున్నామని పద్మ పేర్కొంటోంది.



పిండి వంటలు చేస్తున్న పద్మ

అప్పాల 'సుల్తానాపూర్'



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌లో ఏడాదంతా అప్పాల ఘుమఘుమలు వస్తూనే ఉంటాయి. 15ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన లక్ష్మి లీడర్‌గా పదిమంది సభ్యులతో గ్రూపుగా ఏర్పాటయ్యారు. చిన్నమొత్తాలతో వ్యాపారం చేయాలనుకున్నారు. గ్రూప్‌లోని ఓ సభ్యురాలి ఇంట్లో వివాహ వేడుకకు పెద్దమొత్తంలో పిండివంటలు తయారు చేయాల్సి వచ్చింది. కావాల్సిన సారెను అందరూ కలిసి సిద్ధం చేశారు. తరువాత పిండివంటల తయారీ తెలిసిన పని, తక్కువ పెట్టుబడి కావడంతో వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నారు. అలా ప్రారంభమై ఇప్పుడు ఏటా రూ.60 లక్షల టర్నోవర్ అవుతోంది. అప్పులు తీర్చుతూ, తమ పిల్లలను విదేశాల్లో చదివిస్తున్నారు. మరో 50మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ బిజినెస్ బాగుండటంతో ఇదే వృత్తిగా ఆ గ్రామంలో ఏడు గ్రూపులు ఏర్పడ్డాయి. వీటికింద సుమారు 400మందికి పైగా సహాయకులు ఉపాధి పొందుతున్నారు. 32 వరుసలతో చక్రాల సకినాలు, కిలో పరిమాణంలో లడ్డూ, కరిజ, బెల్లం అరిసెలు, నువ్వుల లడ్డూ, మురుకులు, చెగోడీలూ, గవ్వలు, ఖారా, ఇతరత్రా వంటకా లను పెద్ద ఎత్తున తయారు చేయడం వీరి ప్రత్యేకత. వీరి అప్పాలు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలతోపాటు, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలాంటి దేశాలకు ఆర్డర్‌పై వెళ్తుంటాయి. దీంతో సుల్తానాపూ ర్ ఇప్పుడు అప్పాలపూర్‌గా మారింది.

పిండి వంటలకు కేరాఫ్ గూడూరు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడూరు తెలంగాణ పిండివంటలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామానికి చెందిన చీటి వసంత విదేశాల్లో ఉండే బంధువుల కోసం ఐదేళ్ల క్రితం సకినాలు, గారెలు, రవ్వలడ్డూ, సర్వపిండి, నువ్వుల లడ్డూ తయారుచేసి పంపించారు. అవి వారికి నచ్చడంతో తరుచూ తయారు చేయమని కోరారు. దీంతో చీటి వసంత, కారంగుల రజనీ మరో ఇరవై మందికి ఉపాధి కల్పిస్తూ ఐదేళ్లుగా తెలంగాణ పిండి వంటలు తయారు చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌తోపాటు గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఆర్డర్‌పై తీసుకెళ్తున్నారు. హైదరాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, ముంబయి నుంచి కూడా ఏడాదిపొడవునా ఆర్డర్లు వస్తున్నాయి. ఇవేకాకుండా చికెన్, మటన్, ఫిష్ పచ్చళ్లు అందిస్తున్నారు. సకినాలు, గారెలు, లడ్డూ కిలోకు రూ.300 చొప్పున అందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా నెలరోజుల నుంచే ఆర్డర్లు పంపించామని చెబుతున్నారు.



సకినాలు చేస్తున్న మహిళలు

సంప్రదాయ వంటలు



ఇంట్లో ఖాళీగా ఉండలేక బంధువుల కోసం సకినాలు, గారెలు అందించా. రుచి నచ్చి చాలామంది పిండి వంటకాలు కావాలని అడిగారు. అలా ఐదేళ్ల క్రితం మొదలైన పిండి వంటల తయారీ నిత్యం కొనసాగుతోంది. సకినాలు, సర్వపిండి, గారెలు, లడ్డూలు, అరిసెలు తయారు చేసి ఇస్తున్నాం. ప్రస్తుతం ఆర్డర్లు బాగానే వస్తున్నాయి.

– చీటి వసంత, గూడూరు

సర్కారు సాయం చేయాలి



సహజసిద్ధంగా లభించే పిండిపదార్థాలతో వంటకాలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వం సాయం అందిస్తే పిండివంటకాల అవుట్‌లెట్లు పెడతాం. మరింత మందికి ఉపాధి కల్పిస్తాం. సంక్రాంతి పండగే కాదు సంవత్సరమంతా సకినాలు, గారెలు, సర్వపిండి, చెగొడీలకు గిరాకీ ఉంటుంది. నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తున్నాం.

– కారంగుల రజని, గూడూరు

19 ఏళ్లుగా ఇంటి వంటలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని పవర్‌హౌజ్‌కాలనీలోని శ్రీసాయి తెలంగాణ పిండివంటల టేస్టే సపరేటు అంటున్నారు స్థానికులు. తానిపర్తి రామ్మోహన్‌రావు ఆయన భార్య జయశ్రీ కలిసి పండివంటల కేంద్రాన్ని వారి ఇంట్లోనే నిర్వహిస్తూ 20మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. చకినాలు, గారెలు, అరిసెలు, చగోడిలు, నువ్వుల ముద్దలు, లడ్డులు, కారపూసలు(జంతికలు), కరిజలు, పల్లీలడ్డులు, బక్షాలు, సర్వపిండి తయారు చేస్తున్నారు. వీటిని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు, సూపర్ మార్కెట్‌లు, కిరాణం దుకాణాలతోపాటు హైదరాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్, యుకే తదితర దేశాలకు ఎన్ఆర్ఐ ప్యాకింగ్‌లో తెలుగువాళ్లకు కూడా పంపిస్తున్నట్లు రామ్మోహన్‌రావు తెలిపారు.



గారెలు తయారు చేస్తున్న మహిళలు

పప్పు, జొన్నరొట్టెతో ప్రారంభించాం..



2003లో పప్పు, జొన్న రొట్టెతో ప్రారంభించాం. 19 ఏళ్లుగా పిండి వంటలు తయారు చేస్తున్నాం. మాతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. సంక్రాంతికి ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయి. విదేశాలకు కూడా మేం తయారు చేసిన పిండి వంటలను తీసుకుపోతుండడం ఆనందంగా ఉంది. సంక్రాంతికి 15 రోజుల ముందు నుంచే ఆర్డర్లు రెడీ చేశాం.

– తానిపర్తి రామ్మోహన్‌రావు, జయశ్రీ

'మంథని' రుచులు

మంథని: మంథనికి చెందిన పలువురు మహిళలు స్వయం ఉపాధి కోసం పిండి వంటలు తయారు చేస్తున్నారు. వీటిని విదేశాల్లోని తమవారికి పంపిస్తుంటారు. సంక్రాంతి పండగ పిండి వంటలు పదిహేను రోజుల ముందు నుంచే అమెరికా, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియాతో ప్రపంచంలోని ఆయా దేశాలకు చేరాయి. మంథనిలో కారపు చకినాలు ప్రత్యేకం. పచ్చి మిరపకాయల ముద్ద, కోతిమీర, నెయ్యి, వెన్నతో తయారు చేసే కారపు చకినాలకు మంచి గిరాకీ ఉంటుంది. వీటిని చాలామంది కొనుగోలు చేసుకెళ్తుంటారు. మోతీచూర లడ్డూ కూడా ఇక్కడ స్పెషల్. ఏ రకం పిండి వంటలైనా కిలో రూ.300 నుంచి రూ.400కు విక్రయిస్తుంటారు. 'మేము తయారు చేసిన పిండివంటలు కిలోకు రూ.300 చొప్పున అమ్ముతున్నాం. తయారీ ఖర్చు రూ.250 వరకు ఉంటుంది. కిలోకు యాభై రూపాయలు మిగులుతాయి. పండగ సమయంలో గిరాకీ ఎక్కువగా ఉంటుంది. మిగతా రోజుల్లో తక్కువే. విదేశాలకు పంపేవారు ముందుగానే ఆర్డర్ ఇస్తారు.' అని వాణి లక్ష్మీ నారాయణ స్వగృహఫుడ్స్ నిర్వాహకురాలు బండారి సునీత వివరించారు.



తయారు చేసిన పిండి వంటలతో బండారి సునీత

భోగి.. వైభోగం

- సంబరాలకు ఉమ్మడి జిల్లాలో సర్వం సిద్ధం
- రంగవల్లులు.. డూడూ బసవన్నలు ముస్తాబు

కరీంనగర్‌కల్చరల్/ బోయినపల్లి (చొప్పదండి): మూడురోజుల ముచ్చటైన వేడుక సంక్రాంతి సంబరాలకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. నేటి భోగితో ప్రారంభమయ్యే పండుగ జోష్ కనుమ వేడుకతో ముగియనుంది. భోగి మంటలు వేసి ఆడిపాడేందుకు యువత, చిన్నారులు రెడీ అవుతున్నారు. ఇంటివాకిళ్లు రంగవల్లులతో ముస్తాబుకానున్నాయి. తాటాకులతో భోగి మంట వేస్తారు. ఆ మంటల్లో ముందుగా సిద్ధం చేసుకున్న పాత వస్తువులు వేస్తారు. మంటల మధ్యన నీటితో నింపిన కుండలను పెడతారు. ఆ మంటలకు కాగిన వేడినీటితో భోగి స్నానాలు చేస్తారు. భోగి మంటల్లో పాత వస్తువుల వేయడం వల్ల పీడతొలగి భాగ్యాల్ని అందిస్తుందని విశ్వాసం. భోగి రోజు పిల్లలకు రేగుపండ్లు తలపై పోస్తారు. సాయంత్రం చుట్టుపక్కల పెద్దవాళ్లను పిలిచి వారితో పిల్లలకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా రేగుపండ్లు, చిల్లరనాణేలు, బంతిపూల రెక్కలు, చెరకు ముక్కలు పిడికిలో తీసుకుని పిల్లలకు మూడుస్లారు దిష్టితీస్తారు. సంక్రాంతికి పంటలు చేతికందిన రైతులు రెండోపంట వేసుకునేందుకు తమ పొలాల్లో కొంత మేరకు నీరు పారించి భూమిని తడుపుతారు. దీన్ని పిలకవేయడం అంటారు. భోగి సందర్భంగా మహిళలు ఇంటిముంగిళ్లను రంగవల్లికలతో స్వరాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు ముగ్గుమధ్యలో పెడతారు. ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. శ్రీరంగనాథుడిని గోదాదేవి వివాహం చేసుకున్నది భోగిరోజు కావున.. వైష్ణవ ఆలయాల్లో భోగిరోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు. కొన్నిప్రాంతాల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి ముత్తయిదువులను పేరంటానికి పిలిచి సత్కరిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సంక్రాంతిని మూడురోజులు పాటు ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధం అవుతున్నారు.



మత్తులో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సమీపంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పరిసరాల్లో సిగరెట్లు తాగుతున్నట్లు ఆలయ అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వెనుక ప్రాంతంలో జనసంచారం ఉండకపోవడంతో స్కూల్ విరామ సమయంలో గుంపులుగా వచ్చి సిగరెట్లు తాగుతున్నట్లు తెలిపారు. వద్దని హితవు పలికిన అర్చకులనే బెదిరించినట్లు వారు వాపోయారు. విద్యార్థుల కదలికలపై ఉపాధ్యాయులు నిఘా పెట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- పాఠశాలలకు పాకిన గంజాయి
- గాడిన పెట్టేందుకు ఉపాధ్యాయుల తంటాలు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- గ్రామ శివారు, జనసమ్మర్థం లేని ప్రాంతాలే అడ్డాలు

సిరిసిల్లక్రైం/ఎల్లారెడ్డిపేట: ఇన్నాళ్లు జిల్లా యువతను చిత్తుచేసిన గంజాయి.. ఇప్పుడు పాఠశాల విద్యార్థులను పాడుచేస్తోంది. గంజాయి మత్తులో తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతోపాటు పాఠాల బోధనకు అడ్డుతగులుతున్నట్లు జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామశివారు ప్రాంతాలు, పాఠశాలలకు సమీపంలోని జనసమ్మర్థం లేని ప్రాంతాలకు వెళ్లి గంజాయి సేవిస్తున్నట్లు చూసిన స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి

అధిక విద్యార్థులున్న పాఠశాలలో..

జిల్లాలో ఎక్కువ విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. పాఠశాలల ప్రారంభానికి ముందు, తరగతులు ముగిసిన తర్వాత విద్యార్థులు గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. సిరిసిల్లలోని బీవైనగర్ జెండాగద్దె, స్టేడియం, బతుకమ్మ తెప్ప ఆలయం చెట్ల కింద, మండేపల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఏరియా, టెక్స్‌టైల్ పార్క్ ఇందిరమ్మ ఇళ్లు, వేములవాడ పరిధిలోని శివారు ప్రాంతాల్లో గంజాయి, ఫినిడెక్స్, హస్ ఆయిల్ సేవిస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో కొంతమందిలో మార్పులు వచ్చినప్పటికీ అదే స్థాయిలో కొత్తవాళ్లు మత్తుకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో పట్టుబడిన మత్తు పదార్థాలు ఇలా..

కేసులు	15
అరెస్టయినవాళ్లు	51
పట్టుబడిన గంజాయి	3.509 కిలోలు
పట్టుబడిన హాష్ ఆయిల్	40 గ్రాములు
అరెస్టయిన వాళ్లు	6

పాఠాలు చెప్పే సమయంలో పరేషాన్

విద్యాలయాల్లో పాఠ్యాంశాలు బోధన చేసే ఏదేని సందర్భంలో విద్యార్థులను ప్రశ్నిస్తే వారిచ్చే సమాధానాలు, హావభావాలలో తేడా ఉన్నట్లు తెలుస్తోందని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. గ్రామాల్లో చీకటి పడితే చాలు యువకులు, బడీడు పిల్లలు ఓ వైపు మద్యం, మరోవైపు సిగరెట్ల పేరిట గంజాయి మత్తులో చిత్తవుతున్నారు. ఇలాంటి విషయాలతో స్వచ్ఛమైన గ్రామీణ ప్రాంతాన్ని వదిలిపెట్టి.. పిల్లలతో సిటీలో ఉంటున్నామని ఓ జిల్లాస్థాయి అధికారి తన ఆవేదనను వెల్లడించారు.

నిఘా కొనసాగుతోంది

గంజాయి ఇతర ప్రాంతాల నుంచి మన జిల్లాకు వస్తుంది. సరఫరాపై నిఘా పెట్టి అనేక మందిని అరెస్ట్ చేశాం. విద్యార్థులకు దురలవాట్లు, మత్తుకు అలవాటు పడ్డట్లు తెలియదు. నిఘా తీవ్రతరం చేస్తాం.

– రాహుల్‌హెగ్డే, ఎస్పీ

సమాచారం లేదు

పాఠశాలలో విద్యార్థులు గంజాయి, మత్తుపదార్థాలు సేవించి వస్తున్నారన్న సమాచారం మాకు లేదు. ఇలాంటి సమస్యలు ఉంటే నేరుగా ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చి రక్షణ కోరవచ్చు. ఏ ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థుల్లో ఇలాంటి అలవాట్లు ఉన్నాయో వివరిస్తే వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– రాధాకిషన్, డీఈవో

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న ఆగయ్య

రుద్రంగి(వేములవాడ): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. రుద్రంగి మండలం బడితండా గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి పైకా కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఆగయ్య మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఉండాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు మాలీబాయి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఉప సర్పంచ్ మాలోతు కోటీబాయి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకరయ్య,తదితరులు

సిరిసిల్లఎడ్యుకేషన్: పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి అభ్యర్థులు వారికున్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య సూచించారు. పోటీ పరీక్షలపై అవగాహన కోసం 'ఇగురం' యూట్యూబ్ చానల్, పీఆర్టీయూ సంయుక్తంగా ఈ నెల 16న జిల్లా గ్రంథాలయం సెమినార్‌హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించి, సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సదస్సులో గ్రూప్ 2,3,4 పోటీ పరీక్షలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ఎడ్ల కిషన్, కాపిల్ల నరేశ్, సాంబరెడ్డి, జక్కని నవీన్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు సహించేది లేదు



పోస్టర్ ఆవిష్కరణలో ఎల్లారెడ్డి

వీర్నపల్లి: కార్మికులకు వ్యతిరేకంగా ఎలాంటి విధానాలను సహించమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా వచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 23న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఐకేపీ హమాలీలకు ప్రభుత్వమే కూలీ చెల్లించాలని అన్నారు. హెల్త్‌కార్డులు, ఇన్సురెన్స్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల దేవయ్య, లింబాద్రి, శ్రీనివాస్, భూమయ్య, దేవరాజు ఉన్నారు.

పోస్టల్ పథకాల్లో ప్రీమియం తక్కువ.. బోనస్ ఎక్కువ



మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

బోయినపల్లి(చొప్పదండి): పోస్టల్ బీమా పథకాల్లో పాలసీదారులకు ప్రీమియం తక్కువ చెల్లింపులతో బోనస్ ఎక్కువగా వస్తుందని కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వై.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని విలాసాగర్ గ్రామంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం పోస్టల్ మేళా నిర్వహించారు. పోస్టల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మిగతా ఏ సంస్థల పథకాలు పోస్టల్ పథకాలకు సరిరావన్నారు. ఆర్‌పీఎల్ఐ బీమా ప్రజలకు మేలు చేస్తుందని అన్నారు. సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లల వివాహాలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఏటా రూ.399 చెల్లించి పోస్టల్ ప్రమాద బీమా చేయించుకుంటే ప్రమాదం జరిగినపుడు ఆర్థిక అండగా ఉంటుందని పేర్కొన్నారు. సేవింగ్స్, ఐపీపీబీ, పీఎల్ఐ తదితర పోస్టల్ పథకాలు ఉన్నాయని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఐపీఓ చంద్రమోహన్, సర్పంచ్ జూలపల్లి స్వప్నాంజలి, పీహెచ్‌సీ వైద్యాధికారి అనిత, మేలోరిసియర్ మల్లేశం, బీపీఎంలు జయప్రకాశ్, ఎగుర్ల రాజు, చిందం శశి, కట్ట కిరణ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, ప్రభాకర్, భూంరావు, తిరుపతి, జీవన్ ఉన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



సూచనలిస్తున్న సత్యప్రసాద్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో కంటివెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేయబోయే ఎమ్మార్సీ భవనాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అడిషనల్ డీఆర్డీవో సీహెచ్.మదన్‌మోహన్, ఎంపీడీవో పి.లచ్చాలు, తంగళ్లపల్లి మెడికల్ ఆఫీసర్ స్నేహా, కార్యదర్శి రవి, ఆప్తామాలజిస్ట్ ఎస్.రమేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

ఇసుక వ్యాపారులపై పోలీసుల కొరడా



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

సాక్షి స్పందన

వేములవాడరూరల్: మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వైనంపై గురువారం మల్లారం వయా... మర్రిపల్లి అనే శీర్షిక 'సాక్షి'లో ప్రచురించడంతో స్పందించిన వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు శుక్రవారం తనిఖీ చేపట్టారు. వేములవాడ మూలవాగు నుంచి మైనింగ్, రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదుచేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యంతాగి వాహనాలు నడుతుపుతున్న ఇద్దరిపై శుక్రవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిపేట మండం నారాయణపూర్ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యంతాగి వాహనం నడుపుతుండగా వారిని పట్టుకుని డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు పంపించి వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్ రావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రడం రమేశ్(37) గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు. మృతుడి కూతురు అంగవైకల్యంతో బా ధపడుతోందని వైద్యం చేయించినప్పటికీ న యంకావడం లేదని ఒకవైపు వైద్యానికి చేసిన అప్పులు పెరగగడంతో మనస్థాపం చెంది ఆ త్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి ఎల్లవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి భా ర్య రజిత, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉ న్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై మోతిరామ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ పూట పస్తులేనా..?

- నేటికీ వీఆర్‌ఏలకు అందని వేతనాలు
- మంత్రి హామీ మరిచినట్టేనా..?


మంత్రి కేటీఆర్‌తో చర్చలు జరుపుతున్న వీఆర్‌ఏలు (ఫైల్)



నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

వేములవాడరూరల్: చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడిగా రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఏల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీఎం కేసీఆర్ హామీని అమలు చేయాలని 80 రోజులుగా నిరసన చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. మంత్రి కేటీఆర్ స్వయంగా వీఆర్‌ఏలతో చర్చించి మునుగోడు ఎన్నికలు ముగిసిన తర్వాత సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చి నెలలు గడుస్తోందన్నారు. నేడో రేపో శుభవార్త వస్తుందని ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలు కనీసం వచ్చే కొద్దిపాటి గౌరవ వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల్లో 470 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీరు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్, ఇతర ప్రాంతాల్లో రాత్రీపగలు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం తక్కువే అయినప్పటికీ సకాలంలో అందడం లేదు. రెవెన్యూ, ఆర్డీవో, కలెక్టరేట్ ఆఫీసుల్లో విధులు నిర్వహించే వీఆర్‌ఏలు గ్రామీణ ప్రాంతాల నుంచి విడతల వారీగా విధులు నిర్వహిస్తారు. వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగం చేస్తూ సొంతంగా బస్‌చార్జీలు పెట్టుకుని వెళ్తుంటారు. వీరికి ఇప్పటి వరకు వేతనాలు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెకాలంలో రాని వేతనాలు

80 రోజులు సమ్మెకాలంను ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించి వేతనం మంజూరు చేస్తామని వీఆర్‌ఏలకు హామీ ఇచ్చి ఇప్పటి వరకు వేతనం చెల్లించలేదని ప్రభుత్వాన్ని పలుమార్లు వేడుకున్నప్పటికీ స్పందించలేదని వాపోతున్నారు.

వేతనాలు మంజూరు చేయాలి



సంక్రాంతికి ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయకపోవడంతో చాలామంది వీఆర్‌ఏల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. వేతనాలు వస్తేనే కుటుంబాలను పోషించుకునే పరిస్థితి నెలకొందని ప్రభుత్వం పెద్ద మనసుతో వీఆర్‌ఏలకు వేతనాలు చెల్లించాలి.

– మల్లారం అర్జున్, వీఆర్‌ఏ జేఏసీ, జిల్లా ప్రధాన కార్యదర్శి

హామీ నెరవేర్చాలి



ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. మంత్రి కేటీఆర్‌పై నమ్మకంతోనే సమ్మెను విరమించాం. పండుగ సందర్భంగా గౌరవ వేతనాలు మంజూరు చేయకపోవడం బాధాకరం. చాలామంది వీఆర్‌ఏల కుటుంబాలు మధ్యతరగతి కుటుంబాలే. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. – చొప్పరి తిరుపతి, వీఆర్‌ల మండల అధ్యక్షుడు

లక్షలు వెచ్చించినా దక్కని ప్రాణం..

- నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స
- అరుదైన వ్యాధితో వివాహిత మృతి
- లక్షల్లో ఒకరికి ఈ వ్యాధి


పుష్పలత (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉన్నదంతా ఊడిచ్చిపెట్టి ప్రాణాలు దక్కించుకునేందుకు లక్షల్లో ఖర్చుచేసినా చివరకు ప్రాణాలు దక్కించుకోలేకపోయారు. అప్పులుచేసి రూ.30 లక్షలు వెచ్చించి నెలరోజులు చికిత్స అందించినా అరుదైన వ్యాధి ఓ వివాహిత నిండు ప్రాణం తీసింది. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన నేవూరి పుష్పలత (56) వివాహిత ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఆమె ఏ వ్యాధితో బాధపడుతుందో వైద్యులు గుర్తించలేకపోయారు. స్థానిక వైద్యుడి సూచనతో పుష్పలత తను మేరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి నెలరోజుల క్రితం తరలించారు. అక్కడ కూడా మొదట్లో ఆమె ఇబ్బంది పడుతున్న వ్యాధిని నిర్ధారించలేకపోయారు. పుష్పలతకు లక్షల్లో ఒకరికి వచ్చే వ్యాధి హెచ్‌ఎల్‌హెచ్ వ్యాధిగా చివరకు గుర్తించారు. అప్పటికే వ్యాధి తీవ్రమై తీవ్ర అస్వస్థతకు గురైంది. నెలరోజులుగా రోజుకు రూ.లక్ష చొప్పున నెలకు రూ.30లక్షలు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కలేదని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలికి భర్త బాల్‌రెడ్డి, కూతరు సోని ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సంగీత విభావరిలో పాల్గొన్న కళాకారులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. బీ.భారతి, పద్మనాభశర్మల హరికథ, కే.నరహరి, సీహెచ్ రఘునందన్, ఎన్.అపర్ణ, ఎన్.సతీందర్, శ్రీదేవి, రాగశ్రీ, శ్రీకుమారీల సంగీత కచేరి, తులసీ విశ్వనాథ్‌చే శాస్త్రీయ సంగీత కచేరి, ధర్మరాజు బృందంచే నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఇరు వర్గాలపై కేసు

తంగళ్లపల్లి: మండలంలోని మల్లాపూర్ సర్పంచ్‌పై గ్రామానికి చెందిన ఒక సామాజికవర్గం వారు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గ్రామంలోని కొంత భూమికి సంబంధించిన వ్యవహారంలో సర్పంచ్‌తో పాటు మరో ఆరుగురిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇదే భూమి విషయంలో గురువారం సర్పంచ్ పలువురిపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. భూమి పంచాయతీ కాస్తా ఠాణాకు చేరడంతో గ్రామంలో చర్చ జరుగుతోంది.

వేములవాడ వాసికి నటరాజ పురస్కారం


అవార్డు అందుకుంటున్న రాజేశం

వేములవాడ రూరల్: మండలంలోని నూకలమర్రికి చెందిన ఒగ్గు కళాకారుడు రాజేశం నటరాజ పురస్కారం అందుకున్నట్లు రాజేశం తెలిపారు. శుక్రవారం గోదావరిఖనికి చెందిన సాత్విక్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాజేశంకు అవార్డు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూకలమర్రి సర్పంచ్ పెండ్యాల తిరుపతి, ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, గ్రామస్తులు, మండల కళాకారులు అభినందించారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని బావుసాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ నందకుమార్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎస్పీడీసీఎల్ ఏడీ ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ మద్యంతాగుతున్నాడన్న సమాచారంతో విచారణ చేశామని ఇదీ వాస్తవమేనని రైతులు తెలపడంతో విచారణలో నిజమని తేలడంతో విధుల నుంచి తొలగించామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

నమ్మించి ప్రేమ వివాహం చేసుకొని..

- ఆపై యువతి కుటుంబ సభ్యులకు వేధింపులు
- యువకుడిపై కేసు
- 15 రోజులు జ్యూడీషియల్ రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఓ యువతిని ప్రేమపేరుతో నమ్మించి వివాహం చేసుకుని మోసం చేసిన ఓ యువకుడిని బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియా వేదికగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని యువతి కుటుంబ సభ్యులు న్యాయమూర్తి ఎదుట వాపోయారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 15 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించడంతో కరీంనగర్ జైలుకు తరలించారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన బండ సత్యనారాయణ కూతురిని మోసంచేసి అదే గ్రామానికి చెందిన లంబ బాలకిషన్ వివాహం చేసుకున్నాడు. వివాహం నచ్చక సత్యనారాయణ కూతురు బాలకిషన్‌ను వదిలి పుట్టింటికి వెళ్లింది. దీంతో తన కూతురు, కుటుంబంపై కక్షగట్టి బాలకిషన్ బాధిత కుటుంబ సభ్యుల ఫోటోలను సోషల్ మీడియా వేదికగా వేధిస్తున్నాడని ఈనెల 5న సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. విచారణ అనంతరం నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించగా జ్యూడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సోషల్ మీడియా వేదికగా ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖరీదైన వైద్యం అందక గీత కార్మికుడి మృతి


రవిగౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: పక్షవాతానికి గురైన ఓ గీత కార్మికుడికి ఖరీదైన వైద్యం అందక మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం విషాదం నింపింది. వివరాల్లోకి వె ళితే.. మండలకేంద్రానికి చెందిన పుల్లకు రవిగౌడ్ (51) గీత కార్మికుడు కులవృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో 15 ఏళ్ల క్రితం పక్షవాతంతో మంచం పట్టాడు. అప్పుచేసి, ఉన్న ఎ కరం భూమి అమ్మి ఆస్పత్రుల్లో వైద్యం చేయించిన ప్పటికీ నయం కాలేదు. దీంతో హైదరా బాద్‌కు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించు కోవాలని వైద్యులు సూచించడంతో ఆర్థిక ఇబ్బందు లతో ఇంటివద్దే ఉండిపోయా డు. ఈక్రమంలో మంచంపట్టిన రవిగౌడ్‌కు వైద్యం అందక ఇంటి వద్దే మృతిచెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్ర స్తుతం ఆ కుటుంబానికి పూట గడవడం కష్టంగా మారింది. మృతుడి కుటుంబాన్ని ప్ర భుత్వం ఆదుకోవాని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడికి భార్య ప్రేమల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మండెపల్లికి మొండి చెయ్యి

- గ్రామానికి జాతీయ అవార్డు వచ్చినా.. ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- పారిశుధ్యంలో మిన్నా.. నిధుల కేటాయింపులో సున్నా..
- పత్తా లేని సంక్షేమ భవనాలు, నిధుల కేటాయింపులు


మండెపల్లి గ్రామపంచాయతీ భవనం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండించి రాష్ట్రానికి, రాజన్న సిరిసిల్ల జిల్లాకు, తంగళ్లపల్లి మండలానికి గుర్తింపు తెచ్చిన ఆ గ్రామాన్ని.. అటు ప్రభుత్వం, ఇటు జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి నిధులు ఇవ్వకుండానే గొప్ప గుర్తింపు తెచ్చారని గుర్తించడం మానేశారో ఏమోకానీ మండెపల్లి వైపు కన్నెత్తి చూడడం లేదు. అంతేకాకుండా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రతలో ముందున్న మండెపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధిలో మాత్రం వెనకబడే ఉందని చెప్పక తప్పని పరిస్థితి. నిధులు వచ్చిన గ్రామాలకే మళ్లీ మళ్లీ కేటాయిస్తున్నారు కానీ మండెపల్లి వంటి గ్రామాలను జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

అవార్డుల్లో ముందంజ..

మండెపల్లి జీపీకి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఉన్నత విద్యావంతురాలైన సర్పంచ్ గనప శివజ్యోతి గ్రామ పాలనతో అనూహ్య మార్పులు తెచ్చి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలునాటి సంరక్షించడం, తడి పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయడం తోపాటు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులతో అనేకసార్లు సమావేశాలు ఏర్పాటుచేసి లక్ష్యాన్ని సాధించారు. 2019లో యూనిసెఫ్ అవార్డును గవర్నర్ చేతుల మీదుగా, 2020లో మంత్రి కేటీఆర్ చేతుల మీదగా ఉత్తమ గ్రామ పంచాయతీగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ స్థాయి అవార్డును సైతం కైవసం చేసుకున్నారు..

అభివృద్ధిలో వెనకంజ..

అవార్డుల విషయంలో చెప్పుకోవడం తప్పితే అభివృద్ధిపరంగా మాత్రం ఎలాంటి భవనాలు కానీ, నిధులు కానీ కేటాయించకపోవడం విడ్డూరం.. మండెపల్లిలో గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సంఘం భవనం లేదు. రైతువేదికను ముందుగా మండెపల్లికి కేటాయించి తిరిగి మండలకేంద్రానికి తరలించారు, ఆరోగ్య ఉప కేంద్రం ఊసేలేదు, పశువైద్యశాల ఏర్పాటు ప్రొసీడింగ్‌కే పరిమితమైంది. ప్రగతి భవనం పత్తా లేదు. తెలంగాణ క్రీడా ప్రాంగణానికి స్థల కేటాయింపులో తాత్సారం జరుగుతోంది. మండెపల్లి గ్రామ పంచాయతీకి ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీకి మధ్యలో భూమి హద్దుల సమస్య నెలకొంది. సమస్యలు పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు, జిల్లా యంత్రాంగం రెండు గ్రామాలు గొడవలు పడుతుంటే చోద్యం చూస్తున్నారు.

మహిళా సంఘం భవనం కేటాయించాలి



గ్రామంలో మహిళలు సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు మహిళా సంఘం భవనం లేదు. దీంతో చెట్లకింద సభలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.

– రాగిపెల్లి అరుణ, మహిళా సంఘం సభ్యురాలు, మండెపల్లి

గ్రామాన్ని అభివృద్ధి చేయాలి



మండెపల్లి గ్రామస్తులు పచ్చదనం, పరిశుభ్రత విషయంలో ముందున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు గుర్తించి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలి. గ్రామంలో కమ్యూనిటీ భవనాలు, ప్రగతి భవనం, గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలి.

– నక్క రవి, గ్రామస్తుడు, మండెపల్లి

ప్రోత్సాహం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తాం



మా గ్రామం జాతీయస్థాయిలో అవార్డు పొందడం మా గ్రామ పాలకవర్గం పనితనానికి నిదర్శనం.. ఎలాంటి ప్రత్యే నిధులు లేకున్నా గ్రామాన్ని ముందువరుసలో నిలిపాం. ప్రభుత్వం, జిల్లా అధికారులు అభివృద్ధి పనులకు చొరవచూపితే అద్భుతాలు సృష్టిస్తాం.

– గనప శివజ్యోతి, సర్పంచ్, మండెపల్లి